

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

చేపట్టండి

అధికారులకు మంత్రి సవిత ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత



పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు

పుట్టపర్తి, జూలై 28: ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు జిల్లా పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత.. అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనపై స్థానిక కలెక్టరేట్‌లో ఆదివారం సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. సామాజిక భద్రత పింఛన్ సొమ్మును రూ.4వేలకు పెంచి సీఎం చంద్రబాబు.. పేదింటి పెద్దకొడుకులా అండగా నిలిచారన్నారు. మడకశిర మండలంలోని గుండుమలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. పర్యటనకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న, పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గుండుమలలో పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే

మడకశిర రూరల్: సీఎం పర్యటన నేపథ్యంలో మండలంలోని గుండుమల గ్రామంలో మంత్రి సవిత పర్యటించారు. ఏర్పాట్లను పరిశీలించారు. గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్ పంపిణీ చేసే లబ్ధిదారురాలు సంజీవమ్మ ఇంటికెళ్లి, ఆమెను పలకరించారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో సీఎం కోసం ఏర్పాటుచేస్తున్న హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో దోపిడీయే తప్ప.. అభివృద్ధి లేదని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారన్నారు. ఆర్థిక సంక్షోభంతో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్ము పెంచి, అందజేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, జిల్లా అధ్యక్షుడు అంజినప్ప పాల్గొన్నారు.

కలెక్టర్ సమీక్ష

పుట్టపర్తి, జూలై 28: ముఖ్యమంత్రి పర్యటనపై కలెక్టర్ టీఎస్ చేతన్.. జిల్లాస్థాయి అధికారులతో ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనలో పొరబాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. హెలీప్యాడ్ వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు.. తమ పరిధిలోని పనులు, సమస్యలపై నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఎస్పీ రత్న మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ఠ భద్రతా చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు. హెలీప్యాడ్, ముఖ్యమంత్రి పాల్గొనే సభావేదిక వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

కట్టిపడేసిన హృదయార్పణం

పుట్టపర్తి, జూలై 28: బాలవికాస్ విద్యార్థులు హృదయార్పణం పేరిట ప్రదర్శించిన నృత్యరూపకం భక్తులను కట్టిపడేసింది. రెండోరోజు ఆదివారం స్థానిక సాయికుల్వంత్ సభామండపంలో హిమాచల్‌ప్రదేశ్ భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగించారు. బాలవికాస్ చిన్నారులు నృత్యరూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. హిమాచల్‌ప్రదేశ్ సంప్రదాయ రీతిలో చేసిన నృత్యాలు అలరింపజేశాయి. అనంతరం భక్తి గీతాలు ఆలపించారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.




నృత్యం చేస్తున్న చిన్నారులు



లక్ష్మీచెన్నకేశవపురంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న కాంప్లెక్స్



బొక్కుడే.. బొక్కుడు..!



రెసిడెన్షియల్ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు ఇచ్చిన అనుమతులు

2 నెలలు.. రూ.20 కోట్లు..!

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటిరోజు నుంచే మున్సిపాలిటీలో అధికారులు దోపిడీకి గేట్లెత్తారు. ఏ చిన్నపని కోసం వచ్చినా ప్రజల నుంచి భారీగా డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇల్లు, భవనాల నిర్మాణదారులపై పడి పీక్కుతింటున్నారు. తక్కువ కొలతలతోపాటు కమర్షియల్ నిర్మాణాలను కూడా రెసిడెన్షియల్‌గా చూపిస్తూ రూ.2 లక్షల నుంచి రూ.15లక్షలదాకా వసూలు చేస్తున్నారు. ఇలా అధికారులు జేబులు నింపుకుంటున్నారు. దీంతో మున్సిపాలిటీకి ఆదాయంలేక ఖజానా ఖాళీ అయింది. ఈ రెండు నెలల వ్యవధిలోనే రూ.20కోట్లకుపైగా భవన నిర్మాణదారుల నుంచి ముడుపుల రూపంలో వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ధర్మవరం మున్సిపాలిటీలో వసూళ్లపర్వం

గత వైసీపీ హయాంలో పేట్రేగిన అధికారులు

యథేచ్ఛగా అక్రమాలు

ప్రభుత్వం మారడంతో బదిలీ ఖాయం!

ఆఖర్లో అందినకాడికి దోపిడీ

జేబులు నింపుకోవడమే లక్ష్యంగా విధులు

అమ్యామ్యాలు ఇచ్చుకోలేక జనం విలవిల

గత వైసీపీ పాలనలో మున్సిపల్ అధికారులు పేట్రేగిపోయారు. వైసీపీ నాయకుల అండదండలతో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారు. వసూళ్లపర్వం సాగించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోవడం, కూటమి ఘన విజయం సాధించడంతో తమపై బదిలీ వేటు తప్పదని అవినీతి అధికారులు నిర్ణయానికొచ్చారు. ఎలాగూ.. బదిలీ వెళ్తున్నందున దోపిడీ మరింత పెంచారు. ప్రతి పనికీ రేటు కట్టి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జేబులు నింపుకోవడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వారికి అమ్యామ్యాలు ఇచ్చుకోలేక జనం విలవిల్లాడుతున్నారు. అధికారుల అక్రమార్జన పరాకాష్ఠకు చేరడంతో పురపాలిక ఖజానా ఖాళీ అయింది.

ధర్మవరం

నిబంధనలతో బెదిరించి..

ఓ స్థల యజమాని ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం మున్సిపాలిటీలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో దరఖాస్తు చేసుకుంటారు. దరఖాస్తుదారుడికి నిబంధనలు చెప్పి భయపెడతారు. అలా.. ఆ యజమాని మధ్యవర్తిని ఆశ్రయించక తప్పని పరిస్థితి కల్పిస్తారు. ఆ మధ్యవర్తి కూడా ఎవరో కాదు ఆశాఖలో పనిచేసే సాధారణ ఉద్యోగే. ఆ ఉద్యోగి జోక్యం చేసుకుని, తాము అడిగిన మొత్తం ఇస్తే అప్రూవల్ తగ్గిస్తామని బేరాలు ఆడతారు. వారి చెప్పినట్లు వినాల్సిందే. 1200 చదరపు గజాలున్న స్థలాన్ని 400 గజాలున్నట్లు చూపుతారు. ఈ వ్యత్యాసానికిగాను భారీఎత్తున సంబంధిత యజమాని నుంచి గుంజుతారు. జీప్లస్-2 నిర్మాణానికి మాత్రమే మున్సిపాలిటీ నుంచి అనుమతి ఉంటుంది. ఆపైన నిర్మించాలంటే అహుడా అనుమతి తప్పనిసరి. ఇక్కడ మున్సిపాలిటీకి చెందిన వారే అహుడా అధికారులుగా మారిపోయి తామున్నామంటూ భరోసా ఇచ్చి దగ్గరుండి నిర్మాణాలు సాగిస్తుంటారు. ఇలా ఒక్క ధర్మవరంలోనే 100 దాకా పెద్దపెద్ద భవన నిర్మాణాలు అక్రమంగా చేపడుతున్నా చర్యలు తీసుకోకపోవడం వెనుక భారీఎత్తున ముడుపులు ముట్టినట్టు యజమానులే పేర్కొంటుండం గమనార్హం. లక్ష్మీచెన్నకేశవపురం సర్కిల్‌లో దాదాపు 15 సెంట్లలో ఓ వ్యక్తి దాదాపు 1300 చదరపు గజాల స్థలంలో నిర్మాణాలు సాగిస్తున్నారు. ఇందుకుగాను రూ.10లక్షలకుపైగా ఉన్నతాధికారులకు ముట్టజెప్పినట్లు తెలుస్తోంది. ఈస్థలంలో రెసిడెన్షియల్ కింద 400 చదరపు గజాలకు మాత్రమే అనుమతి తెచ్చుకుని భారీఎత్తున కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. వీటికి తోడు ఆ భవనం చుట్టూ నిబంధనల ప్రకారం చేపట్టాల్సిన చర్యలు కూడా తీసుకోలేదు. మున్సిపాలిటీలోని ఇద్దరు ఉన్నతాధికారులు.. ఆ ఇంటి యజమానితో కుమ్మక్కవడంతో ఎన్ని ఫిర్యాదులు వచ్చినా.. పట్టించుకోకపోగా.. వారే దగ్గరుండి పనులు చేయిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాక్ష్యాత్తు మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా నాలుగు అంతస్థుల భవనాన్ని నిబంధనలకువిరుద్ధంగా నిర్మిస్తున్నా కిందిస్థాయి నుంచి ఉన్నతస్థాయి అధికారి వరకు నిత్యం చూస్తున్నారే తప్ప.. పట్టించుకోలేదంటే ఏ స్థాయిలో ముడుపులు ముట్టి ఉంటాయే అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వంలో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు దౌర్జన్యంగా ఇళ్లు, కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టారు. అప్పట్లో వారి నుంచి ఒక్కపైసా కూడా ఆశించని అధికారులు.. పాలకపక్షం మారగానే కూటమి నేతలు నిలుపదల చేయించారని చెప్పి వారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నట్లు పట్టణంలో చర్చ సాగుతోంది. ఇలా మున్సిపాలిటీకి రావాల్సిన సొమ్మును సొంత జేబుల్లో వేసుకుంటున్నారు. మున్సిపాలిటీ ఆదాయానికి భారీ గండి కొడుతున్నారు. 25వ వార్డులో నిబంధనలను ఉల్లంఘించి ఇళ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు అటువైపు చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.



మున్సిపల్ కార్యాలయం ఎదుటే నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

విచారించి, చర్యలు చేపడతాం

ధర్మవరం మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతుంటే విచారించి, చర్యలు చేపడతాం. ఎవరైనా ఫిర్యాదు చేసినా.. ఆధారాలు సమర్పించినా.. వెంటనే విచారిస్తాం. -**సంజీవన్‌కుమార్, ఆర్డీ, టౌన్‌ప్లానింగ్, ఉమ్మడి అనంతపురం జిల్లా**

ధర్మవరాన్ని అభివృద్ధి చేసి.. చూపిస్తా..

హామీలన్నీ నెరవేరుస్తా..: మంత్రి సత్యకుమార్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం, జూలై 28: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే బాధ్యత తనదనీ, ధర్మవరాన్ని అభివృద్ధి బాట పట్టిస్తానని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. స్థానిక సీఎన్‌బీ గార్డెన్‌లో ఆదివారం చేనేత ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ధర్మవరం ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. వైసీపీ నాయకులు.. కూటమిలో విభేదాలున్నాయంటూ బురద జల్లుతున్నారన్నారు. కూటమిలో విభేదాలకు తావులేదన్నారు. కలిసికట్టుగా పనిచేసి, ప్రజలకు సేవ చేయడమే తమ ప్రథమ కర్తవ్యమన్నారు. కూటమిలో చిచ్చుపెట్టాలని ప్రయత్నిస్తే వైసీపీకి గుణపాఠం చెబుతామని మంత్రి హెచ్చరించారు.

మంత్రిని కలిసిన ఎస్పీ

రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జిల్లా నూతన ఎస్పీ రత్న ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందజేశారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతలపై చర్చించారు.



మంత్రికి మొక్క అందజేస్తున్న ఎస్పీ



ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

ఆగని వైసీపీ మట్టి దందా

బత్తలపల్లి చెరువులో అక్రమంగా తవ్వకాలు

రెండు ఎక్స్‌కవేటర్లు, మూడు ట్రాక్టర్లు సీజ్

బత్తలపల్లి, జూలై 28: కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు కావస్తున్నా.. వైసీపీ మట్టి దందా ఆగట్లేదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రూ.కోట్లు కొల్లగొట్టిన ఆ పార్టీ నాయకులు.. పాలకపక్షం మారినా.. దందా కొనసాగిస్తున్నారు. బత్తలపల్లి సమీపంలోని చెరువలో ఏకంగా రెండు ఎక్స్‌కవేటర్ల ద్వారా వైసీపీ నాయకులు మట్టి తవ్వకాలకు తెగబడ్డారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. యథేచ్ఛగా మట్టి తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా.. సమాచారం అందుకున్న పోలీసులు పట్టుకున్నారు. మండల కేంద్రానికి చెందిన వైసీపీ నాయకులు అనుమతులు లేకుండా చెరువులో మట్టి తవ్వి, తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వారు ఆదివారం దాడులు చేసి, పట్టుకున్నారు. రెండు ఎక్స్‌కవేటర్లు, మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు.

ఇన్‌స్పెక్టర్ల బదిలీలు కొలిక్కి?

వారంలోపు జాబితా విడుదలయ్యే అవకాశం.. ఉన్నతాధికారులకు జాబితా అందజేసిన ఎమ్మెల్యేలు

హిందూపురం, జూలై 28: గతంలో ప్రభుత్వాలు మారిన వెంటనే మొదట బదిలీల ప్రక్రియ చేపట్టేది పోలీసు శాఖ. అది కూడా అధికాంలోకి వచ్చిన నెలలోపే క్షేత్రస్థాయి వరకు బదిలీలు జరిగిపోయేవి. ఈసారి మాత్రం ఎందుకో ఫలితాలు వెలువడి రెండు నెలలు దగ్గర పడుతున్నా ఇప్పటికీ ఒక ఇన్‌స్పెక్టర్‌ని కూడా బదిలీ చేయలేదు. దీంతో వైసీపీ అధికారంలో ఉన్నపుడు వచ్చిన అధికారులతోనే టీడీపీ నాయకులు బతిమలాడి పనులు చేయించుకోవాల్సిన దుర్భర పరిస్థితి ప్రస్తుతం అధికార పార్టీ నాయకులకు వచ్చింది. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో వైసీపీ నాయకులమాటే చెల్లుబాటు అవుతోంది. హిందూపురం నియోజకవర్గంలో నేటికీ వైసీపీ నాయకులు చెప్పిందే తప్ప.. ప్రస్తుత అధికార పార్టీ నేతల మాటలను పెడచెవిన పెడుతున్నారని ఆ పార్టీ మండల కన్వీనర్లు.. ఎమ్మెల్యే నివాసం వద్ద బహిరంగంగా వాపోయారు. జరిగిన అన్యాయాలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే వాటిని తొక్కిపెట్టి వైసీపీకి అనుకూలం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితుల్లో వారంలోపు ఇన్‌స్పెక్టర్ల బదిలీలు కొలిక్కి రావచ్చని అధికార పార్టీ నాయకులు భావిస్తున్నారు. అదికూడా వారంలోపే అధికారికంగా జాబితా విడుదలయ్యే అవకాశం కనిపిస్తోంది.



సాధ్యమైనంత వరకు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల ఆధారంగానే జాబితా రూపొందించినట్లు సమాచారం. ఈసారి సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఇన్‌స్పెక్టర్లకు, గట్టిగా పనిచేసే వారికి ప్రాధాన్యమివ్వాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యేలు ఉన్నారు.

ఎవరు.. ఎక్కడ..?

హిందూపురం నియోజకవర్గంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నది బహిరంగ రహస్యమే. యథేచ్ఛగా హత్యలు జరిగాయి. గంజాయిని వీధుల్లో విక్రయించారు. పేకాట విషయానికి వస్తే పోలీసులే దగ్గరుండి ఆడిస్తున్నారన్న ఆరోపణలు మూటగట్టుకున్నారు. ఈ నేపథ్యంలో బాగా పనిచేస్తారో తెలుసుకొని రప్పిస్తున్నారు. గతంలో టీడీపీ హయాంలో పనిచేసిన ఓ ఇన్‌స్పెక్టర్‌ని కీలకమైన స్టేషన్‌కి గత టీడీపీ హయాంలోనే ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసి, నేరస్థులకు భయం పుట్టేలా వ్యవహరించిన అధికారికి ఉద్యోగోన్నతి వచ్చింది. ఆయన ఈ ఐదేళ్లూ లూప్‌లైన్‌లోనే ఉన్నారు. మరో కీలకమైన, క్లిష్టమైన స్టేషన్‌కి పెనుకొండ ప్రాంతంలో ఎస్‌ఐగా పనిచేసి ఉద్యోగోన్నతి పొందిన మరో ఇన్‌స్పెక్టర్‌ను తీసుకొచ్చేందుకు జాబితా సిద్ధం చేశారు. మరో స్టేషన్‌కి తీసుకురావాల్సిన ఎన్‌స్పెక్టర్ కోసం ఆరా తీస్తున్నారు. పెనుకొండ నియోజకవర్గంలో రెండు ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఉండగా.. అక్కడ కూడా మంచి అధికారులు తీసుకువచ్చేందుకు జాబితాను ఉన్నతాధికారులకు అందజేశారు. ఒక డివిజన్ అధికారి కోసం గ్రూప్-1 అధికారిని తీసుకువస్తున్నారు. ఇక కానిస్టేబుళ్లకు కూడా పెద్దఎత్తున స్థాన చలనం చేస్తున్నట్లు సమాచా రం. ఏది ఏమైనా ఇన్‌స్పెక్టర్ బదిలీలు వారంలోపు ఉండొచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలి

- ఆర్‌యూపీపీ నాయకులు



మాట్లాడుతున్న రాష్ట్ర సహాధ్యక్షుడు ఎర్రిస్వామి

అనంతపురం విద్య, జూలై 28: రాష్ట్రంలోని పాఠశాలల్లో తెలుగు మాధ్యమంలో బోధన లేకపోవడం బాధాకరమనీ, వెంటనే పునరుద్ధరించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) నాయకులు కోరారు. ఆదివారం ఆ సంఘం నాయకులు ఓ స్కూల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు ఎర్రిస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యావ్యవస్థలో తెలుగు మాధ్యమం లేకుండా కేవలం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే బోధించాలంటూ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని విద్యార్థులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు మాధ్యమంలో బోధన లేకపోవడం వల్ల అటు ఇంగ్లీష్, ఇటు తెలుగు సంపూర్ణంగా రాక విద్యార్థుల్లో విషయ అవగాహన చేసుకోలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. విలీనం చేసిన 3,4,5 క్లాసులను ప్రైమరీ స్కూళ్లలో తిరిగి చేర్చాలని, విద్యావ్యవస్థకు శరాఘాతంగా మారిన 117 జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమేష్, ప్రధానకార్యదర్శి తులసిరెడ్డి, సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, ఇతర నాయకులు వెంకటేష్, గోపాల్,నవీన్ కుమార్, వెంకటరమణారెడ్డి, ధనుంజయ, రవికుమార్ పాల్గొన్నారు.


పీఏబీఆర్‌లోకి తుంగభద్ర నీరు



కాలువను పరిశీలిస్తున్న అధికారులు

కూడేరు, జూలై 28: తుంగభద్ర డ్యాం నుంచి విడుదల చేసిన నీరు లింక్ చానల్ ద్వారా పీఏబీఆర్ డ్యాంలోకి ప్రవహిస్తోంది. ఆదివారం లింక్ చానల్ ద్వారా పీఏబీఆర్ డ్యాంలోకి వస్తున్న నీటికి ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు, డీఈ విశ్వనాథ్‌రెడ్డి, ఏఈ రామకృష్ణ, ఏఈఈ లక్ష్మీదేవి పూజలు చేశారు. ప్రస్తుతం పీఏబీఆర్ డ్యాంలో నీటిమట్టం అర టీఎంసీకి పడిపోయింది. గత ఏడాది తుంగభద్ర డ్యాం నుంచి 2. 158 టీఎంసీల నీరు మాత్రమే పీఏబీఆర్‌లోకి రావడంతో మొత్తం 3.285 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది వర్షాలు సక్రమంగా రాకపోవడంతో నీటి కొరత తీవ్రమైంది. డ్యాంలోనున్న శ్రీరామిరెడ్డి, సత్యసాయి, అనంతపురం పట్టణం, ఉరవకొండ తాగునీటి పథకాలకు నీటిని వినియోగించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో కుడికాలువ నీరు వదలలేదు. డ్యాంలో నీటి మట్టం రోజు రోజుకు పడిపోవడం, తాగునీటి పథకాలకు నీరు అందక ఆందోళన చెందుతున్న తరుణంలో తుంగభద్ర డ్యాం నీరు రావడం కాస్త ఊరటనిచ్చింది. ఈ ఏడాది కుడికాలువకు నీరు వదలాలని రైతులు నుంచి డిమాండ్ పెరుగుతుండటంతో ఇరిగేషన్ అధికారులు ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

తగ్గని వరద



తుంగభద్ర డ్యాం 33 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలిన దృశ్యం

బొమ్మనహాళ్, జూలై 28: తుంగభద్ర జలాశయానికి ఆదివారం భారీ ఎత్తున వరద పోటెత్తింది. ఈ నేపథ్యంలో బోర్డు అధికారులు డ్యాం 33 క్రస్ట్ గేట్లను (23 గేట్లు నాలుగు అడుగులు, 10 గేట్లు ఒక్క అడుగు) ఎత్తి 1,56,871 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఇందులో తుంగభద్ర నదికి జలాశయం పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో 1,46, 288 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. జలాశయం రక్షణ చర్యల్లో భాగంగా గేట్లన్నీ ఎత్తిన తుంగభద్ర బోర్డు అధికారులు వచ్చిన వరదనీటిని వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. 1633 అడుగులతో 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న ఈ జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 1630 అడుగులతో 97.791 టీఎంసీల నీరు నిల్వ ఉంది. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105 కి.మీ. వద్ద 826 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

టమోటా కిలో రూ.30

అనంతపురంరూరల్, జూలై 28: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం 1425 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ.17 పలికినట్లు ఆయన తెలిపారు.

వైసీపీ పాపానికి అనాథల్లా సచివాలయ ఉద్యోగులు

ఉద్యోగభద్రత కల్పించాలి
జీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి
ఉద్యోగులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి
ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు, ఐక్యవేదిక చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న కేఆర్ సూర్యనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 28: గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపానికి సచివాలయ ఉద్యోగులు తల్లిదండ్రులు లేని అనాథల్లా ఉండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఈ పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలని ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు, ఐక్యవేదిక చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ కోరారు. ఆదివారం స్థానిక ఆదివారం స్థానిక పాతూరులోని పద్మావతి ఫంక్షన్‌హాల్‌లో ఏపీ గ్రామ-వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ జగన్ నాయకత్వంలోని గత వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేయడంలో భాగంగానే నిరుద్యోగ యువతీ, యువకులను గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగాల పేరుతో మోసం చేసిందని మండిపడ్డారు. ఉన్నత విద్యావంతులు, లక్షల్లో వేతనాలు తీసుకుంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం ప్రభుత్వ ఉద్యోగమనే ఆశతో వచ్చి సచివాలయ ఉద్యోగాల్లో చేరారన్నారు. అయితే రెండేళ్ల పాటు రూ.15వేలు వేతనంతోనే వెట్టిచాకిరీ చేయించుకున్నారని విమర్శించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా సచివాలయ ఉద్యోగాల నియామక ప్రక్రియ చేస్తుంటే అప్పటి సీఎస్, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఎందుకు ప్రశ్నించలేకపోయారని నిలదీశారు. గత ప్రభుత్వం చేసిన పాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగులు సఫలమయ్యారని ఈ క్రమంలో ఏర్పాటైన నూతన ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు గత ప్రభుత్వ వైఫల్యాలు, స్కాంలు, నిధుల దుర్వినియోగం, అక్రమ కేసులు, అరాచక పాలనపై శ్వేతపత్రాలు విడుదల చేయడం శుభపరిణామమన్నారు. ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, పింఛన్లు ఇవ్వాలని, లోపభూయిష్టంగా తీసుకువచ్చిన జీపీఎస్ రద్దు చేయాలని గవర్నర్ కలిసి విన్నవించిన పాపానికి తనను పోలీసుల చేత చంపించాలని చూసిన దుర్మార్గుడు జగన్ అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వెంటనే జీపీఎస్ రద్దు చేయాలని, ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించాలని గత ప్రభుత్వంలో శాంతియుత ఆందోళన చేసిన ఉద్యోగులపై అక్రమంగా బనాయించిన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్‌రజాక్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి, ఒకే అధికారి అజమాయిషీలో జాబ్‌చార్ట్ కింద పనిచేసే వాతావరణాన్ని తీసుకు వచ్చి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు వరప్రసాద్, కార్యదర్శి వీకే లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, ఉపాధ్యక్షులు శివశంకర్, సాకే రామాంజినేయులు, హనుమంత, శివరాజు, నాయకులు మణికంఠ, మౌలాలమ్మ, ప్రియాంక, కళావతి, విమల, జైనూబీ పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల్లో భారత్‌కు ప్రత్యేక గుర్తింపు

బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ



ప్రవచనం చేస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ



కళాకారుల నృత్య ప్రదర్శన

అనంతపురం కల్చరల్, జూలై 28: ప్రపంచ దేశాల్లో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు ఉందని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ పేర్కొన్నారు. రామకృష్ణ సేవాసమితి 20వ వార్షికోత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం సాయంత్రం స్థానిక జీఆర్ ఫంక్షన్ హాల్‌లో షణ్ముఖశర్మ ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు శ్రీనృత్యకళానిలయం నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి శిష్యబృందం శివపదం కీర్తనలకు నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. అనంతరం సామవేదం షణ్ముఖశర్మ భక్తులకు అనుగ్రహభాషణం చేస్తూ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం భారతదేశమని, ఇక్కడ ఉన్నన్ని సంస్కృతులు, సంప్రదాయాలు మరే దేశంలోనూ లేవని పేర్కొన్నారు. అందువల్లే ప్రపంచదేశాల్లో భారతదేశానికి ఇంతటి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. భారతదేశస్తులమని తెలియగానే ఏ దేశస్థులైనా మనకు నమస్కారం చేయాలనే భావన కలుగుతుందంటే మన సంస్కృతి, సంప్రదాయాల ప్రాశస్త్యం అర్థం చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు డాక్టర్ శ్రీకృష్ణశశి, కార్యదర్శి ప్రవీణ్, సహాయ కార్యదర్శి శ్రీధరమూర్తి, వేణుగోపాల్, సంధ్యామూర్తి పాల్గొన్నారు.

రాయలసీమ కవి కంఠం మల్లెల

పుస్తకావిష్కరణ సభలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్, జూలై 28: రాయలసీమ ప్రాంత ప్రజల నిర్దిష్ట జీవితాన్ని వాస్తవిక దృక్పథంతో రాసిన కవి, రాయలసీమ సంస్కృతి, సంక్షేమంకోసం నిరంతరం సాహిత్యాన్ని సృష్టిస్తున్న కవి కంఠం మల్లెల నరసింహమూర్తి అని వక్తలు కొనియాడారు. కవి మల్లెల నరసింహమూర్తి రచించిన 'మాకూ ఒక నది కావాలి', 'మట్టి తంబూర' కవితా సంపుటాల ఆవిష్కరణ సభను విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్‌ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు డాక్టర్ శాంతినారాయణ ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకావిష్కరణ చేసి ప్రసంగించారు. సమాజంలోని వాస్తవిక పరిస్థితులను పసిగట్టి మల్లెల సాహిత్యం రాశారన్నారు. డాక్టర్ బండారు ప్రసాద్‌మూర్తి మాట్లాడుతూ ఒక తాత్విక చింతన, హృదయ తడి ఉన్న కవి మల్లెల అని కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి మాట్లాడుతూ రాయలసీమకు దశాబ్దాల నుంచి నీటి సమస్య ఉందని, రాయలసీమకు నీళ్లు కావాలని కోరుకునే కవుల్లో మల్లెల ఒకరన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు లక్ష్మీనరసయ్య, విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ వెంకటరామిరెడ్డి, తూముచెర్ల రాజారాం, డాక్టర్ నాగేశ్వరాచారి, సడ్లపల్లి చిదంబరరెడ్డి, డాక్టర్ నానీల నాగేంద్ర, గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, బాలకొండ ఆంజనేయులు, కొత్తపల్లి సురేష్, జూటూరు షరీఫ్, షేక్ రియాజుద్దీన్, గాయకుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వైద్య విభాగం.. ఎంతో కీలకం

సదస్సులో అతిథులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

అనంతపురం టౌన్, జూలై 28: మానవాళి ఆరోగ్యకర జీవనవిధానానికి సామాజిక వైద్యశాస్త్ర విభాగం ఎంతో కీలకమని వైద్యకళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం జిల్లా మెడికల్ కళాశాలలో రాయలసీమస్థాయిలో పీజీలకు సామాజిక వైద్యశాస్త్రవిభాగంపై డాక్టర్ మధు ఆధ్వర్యంలో శిక్షణ సదస్సు నిర్వహించారు. సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యరంగం రోజురోజుకీ దూసుకుపోతోందన్నారు. ప్రతి వైద్యుడు నిత్యవిద్యార్థిలా చదువుకుంటూనే వృత్తిలో రాణించాలన్నారు. సామాజిక వైద్యవిధానం జీవన విధానంలో ప్రధానపాత్ర పోషిస్తుందన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినికి మొమెంటో, సర్టిఫికెట్ అందజేస్తున్న సభ్యులు

తాడిపత్రి/అనంతపురం క్లాక్‌టవర్, జూలై 28: భీమవరంలో ఈనెల 27, 28తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-11 చదరంగం పోటీల్లో ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని అనిమి యశశ్విని అత్యున్నత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల కరస్పాండెంట్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినికి అభినందించారు. యశశ్విని జాతీయస్థాయికి ఎంపికకావడంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేశారు.

పశువుల సంత ఆదాయం రూ.2.73 లక్షలు

అనంతపురంరూరల్, జూలై 28: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.2,73,860 ఆదాయం వచ్చినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,53,600, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,20,260 వచ్చిందని తెలిపారు.

ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు



మాట్లాడుతున్న హృదయరాజు

అనంతపురం విద్య, జూలై 28: విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయ రాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల 117 జీవో తీసుకొచ్చి ప్రైమరీ స్కూళ్లను నాశనం చేసిందన్నారు. 3,4,5 క్లాసుల విలీనం, ఇంగ్లీష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్, టోఫెల్ అంటూ అనేక అసంబద్ధ కార్యక్రమాలు తెచ్చి వ్యవస్థను సమస్యల సుడిగుండంగా మార్చారంటూ మండిపడ్డారు. కొత్త ప్రభుత్వం వీటిని పరిష్కరించాల్సి ఉందన్నారు. అదేవిధంగా ఏపీజీఎల్ఐసీ,పీఎఫ్ విభాగాల్లో పేరుకుపోయిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. 12వ పీఆర్సీ ఆలస్యం నేపథ్యంలో వెంటనే ఐఆర్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కులశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకట సుబ్బయ్య, విశ్వనాథ్‌రెడ్డి, మహమ్మద్‌రఫీ, శ్రీనివాస్ నాయక్, సత్యప్రసాద్, రవీంద్ర, తిమ్మప్ప, అశోక్ , ఆంజినేయులు, సాయి తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి: ఎస్టీయూ

అనంతపురం విద్య, జూలై 28: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం టీచర్లు, ఉద్యోగులు అకాంక్షలకు అనుగుణంగా 12వ పీఆర్సీకి సంబంధించిన ఐఆర్ వెంటనే ప్రకటించాలన్నారు. గత పీఆర్సీ బకాయిలను, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలీను చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాప్రధానకార్యదర్శి రామాంజినేయులు మాట్లాడుతూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న జీవో 117ను రద్దు చేయాలన్నారు. 3,4,5 క్లాసును మళ్లీ ప్రైమరీ స్కూళ్లలో కలపాలని కోరారు. ఇంగ్లీష్ మీడియంతోపాటు, తెలుగు మీడియం కూడా కొనసాగించాలని డిమాండ్ చేశారు. 98,2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సూర్యుడు, చంద్రశేఖర్, శివయ్యచారి, సురేష్‌బాబు, రాజశేఖర్, మహమ్మద్‌రఫీ, నాగభూషణం, మల్లికార్జున, కృష్ణమూర్తి, రాజన్న, రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణారెడ్డి

గుత్తికోటను సందర్శించిన ఆర్డీటీ బృందం



కోటలో పర్యటిస్తున్న ఆర్డీటీ డైరెక్టర్ విశాలాఫెర్రర్

గుత్తి, జూలై 28: పట్టణంలోని గుత్తికోటను ఆదివారం ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్ తన బృందంతో సందర్శించారు. కోటలోని పలు అద్భుతాలను, కట్టడాలను తిలకించారు. కోట కట్టడాలు అద్భుతంగా ఉన్నాయని కోటను ప్రభుత్వం అభివృద్ధి చేస్తే బాగుంటుందన్నారు. గుత్తికోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ కోట చరిత్ర పుస్తకాన్ని ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, కోటగైడ్ రమేష్, నాయకులు చిరంజీవి, జిలాన్, హర్షద్, పురవస్తు శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పనిచేస్తూ కుప్పకూలిపోయిన రైతు

-ఆస్పత్రికి తరలించేలోపు మృతి..



నవీన్ కుమార్ (ఫైల్)

కళ్యాణదుర్గం (కంబదూరు), జూలై 28: అందరితో హాయిగా, అప్పటి వరకు నవ్వుకుంటూ టమోటా తోటలో పనిచేస్తున్న ఓ రైతు ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. కంబదూరు మండలం కొత్తపల్లికి చెందిన రైతు నవీన్‌కుమార్(32) ఆదివారం టమోటా తోటలో పనిచేయడానికి వెళ్లాడు. బాక్సులను కాయలతో నింపుతూ పనిచేసుకుంటూ ఉన్నాడు. టమోటా బాక్సులను మోసుకుంటూ పనిచేస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలాడు. తోటి కూలీలు మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ మాట్లాడలేదు. వెంటనే కూలీలు ఆటోలో కంబదూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇతడికి 10 నెలల క్రితమే వివాహం జరిగింది. దీంతో తనకు దిక్కెవరంటూ భార్య దేవి భర్త మృతదేహంపై పడి విలపించడం కంటతడి పెట్టించింది. స్టేట్ లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ ఆవుల తిప్పేస్వామి మృతుడి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



నివేద్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 28: జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు నివేద్ ఎంపికయ్యాడు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటల్లో ప్రతిభ చాటిన జిల్లాకు చెందిన క్రీడాకారుడు నివేద్ గోల్డ్‌మెడల్ సాధించి ఆగస్టు 2వతేదీ నుంచి విశాఖపట్నంలో నిర్వహించే జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. ఎంపికైన క్రీడాకారుడికి, కోచ్ శ్రీకాంత్‌రెడ్డికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, గురుస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి శాంతరాజ్, సభ్యులు, కోచ్‌లు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలకు 324 మంది హాజరు

అనంతపురం సెంట్రల్, జూలై 28: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలకు 324మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ఆదివారం కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రాన్ని జీవీ రమణ, సీఈ డాక్టర్ లోకేష్‌తోపాటు రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ చివరి సంవత్సరంలో ఐదు, ఆరు సెమిస్టర్ పరీక్షల్లో సబ్జెక్టులు మిగిలిపోయిన విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఫలితాలను సోమవారం విడుదలచేస్తామని పేర్కొన్నారు.



పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న రెక్టార్, రిజిస్ట్రార్

స్వీపర్లకు కనీస వేతనాలివ్వాలి



సమావేశంలో పాల్గొన్న స్వీపర్లు

ధర్మవరం, జూలై 28: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లకు కనీస వేతనాన్ని అమలుచేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్ ఎల్ ఆదినారాయణ ప్రభుత్వాన్ని విజ్ఞప్తిచేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన స్వీపర్లకు అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో దాదాపు 20 సంవత్సరాలుగా స్వీపర్లుగా పనిచేస్తున్న వారికి కేవలం నాలుగు వేల రుపాయిలు మాత్రం వేతనం ఇస్తున్నారన్నారు. అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలో చాలీచాలనీ వేతనాలతో వారి కుటుంబాల పోషణ చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ప్రభుత్వం ఇస్తున్న వేతనం ఏ మాత్రం సరిపోవడం లేదని అన్నారు. ప్రభుత్వం వారి వేతనాలను పెంచాల న్నారు. కార్యక్రమంలో స్వీపర్ల నాయకురాళ్లు జయమ్మ, చౌడమ్మ, ముంతాజ్, నాగలక్ష్మీ పాల్గొన్నారు.

గర్భకోశ చికిత్స శిబిరం

ధర్మవరంరూరల్, జూలై 28: మండలంలోని వసంతపురం గ్రామంలో చింతలపల్లి పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం పెయ్యిదూడల లింగనిర్ధారణ వీర్యం వినియోగం కోసం ఉచిత గర్భకోశచికిత్స శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ హాజరయ్యారు. పాడిరైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ధర్మవరం పశుసహాయసంచాలకులు డాక్టర్ వీరభద్రయ్య, పశువైద్యాధికారి డాక్టర్ శేఖర్, ఏహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

ఎలుగుబంట్ల సంచారం

ఓబుళదేవరచెరువు, జూలై 28: మండలంలోని పెద్దగుట్టపల్లి పరిసర ప్రాంతాలు, నల్లగుట్టలో సుమారు మూడు వారాలుగా ఎలుగుబంట్లు సంచరిస్తున్నాయి. అవి ప్రస్తుతం పొలాల్లో కూడా సంచరిస్తుండటంతో రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నల్లగుట్ట సమీపంలోని అమడగూరు, మహమ్మదాబాద్ సమీపంలో పిచ్చలకొండ ఉండడంతో ఎలుగుబంట్లు ఆ కొండ నుంచి నల్లగుట్టలోకి వస్తూ పోతుంటాయని ఆయా గ్రామస్థులు చెబుతున్నారు. అటవీ అధికారులు స్పందించి అవి గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కొండ సమీపంలో సంచరిస్తున్న ఎలుగుబంటి

కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ధర్మవరం, జూలై 28: స్థానిక బాలుర ఉన్నతపాఠశాల ఆవరణంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. దీన్ని ఆ పాఠశాల హెచ్ఎం శైలజ, ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ మార్కండేయులు ప్రారంభించారు. ఈ శిబిరంలో 92 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 55 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి రమేశ్, కోశాధికారి నాగేంద్ర, ప్రతినిధులు గోసేరాధాక్రిష్ణ, మెటికల కుళ్లాయప్ప, రాజగోపాల్ పాల్గొన్నారు.

మండల కార్యవర్గం ఎన్నిక



సమవేశమైన బలిజ కులస్థులు

నల్లచెరువు, జూలై 28: శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం స్థానిక శ్రీమార్కెండేయ దేవాలయంలో నిర్వహించారు. మండలంలోని బలిజ కులస్థులు హాజరై కమిటీని ఎన్నికున్నారు. మండలాధ్యక్షుడిగా గొర్ల చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా సమత్‌కోట సిద్దప్ప, గౌరవాధ్యక్షుడిగా ఆకుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా శెట్టిపల్లి నాగేంద్ర, ట్రెజరర్‌గా శ్రావణ్‌కుమార్‌ను ఎన్నిక చేశారు. ఈ కార్యక్రమంలో కమ్మల వెంకట రమణ, కమ్మల శ్రీనివాసులు, తవళం వేణుగోపాల్, శెట్టిపల్లి శ్రీనివాసులు, మాడిశెట్టి చంద్రమోహన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



అంచులు విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

ముదిగుబ్బ: స్థానిక శివాలయం వీధి నుంచి వారపు సంతకు వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు అంచులు దెబ్బతినడంతో పలు ప్రమాదాలు జరుగుతు న్నాయి. రోడ్డు మలుపులో కల్వర్టు అంచులు విరిగిపో వడంతో వాహనదారులు అదుపు తప్పి.. డ్రైనేజీలో పడుతున్నారు. ఇక ఆటోలు, ఇతర వాహనాలు ఇచ్చేందుకు ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి ఆ కల్వర్టుకు మరమ్మ తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గుజిరీ షెడ్లను తలపిస్తున్న పోలీస్ స్టేషన్లు



తుప్పుపట్టిన వాహనాలు



ముదిగుబ్బ : మండలంలో వివిధ రకాల కేసుల్లో పట్టుబడిన వాహనాలు, ప్రమాదాలకు గురైన ద్విచక్రవాహనాలు, ఆటోలు, బొలెరోలు, ఇతర వాహనాలను స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్, మండలంలోని పట్నం పోలీస్ స్టేషన్‌ల ఆవరణాల్లో ఉంచారు. మద్యం కేసులో పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలను గత ఏడాది సంబంధిత అధికారులు పది వాహనాలను వేలం వేశారు. ఇక పలు ప్రమాదాల్లో స్వాధీనం చేసుకున్న బైక్‌లు, ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు మాత్రం అలాగే స్టేషన్‌ల్లో ఉంచారు. వాటికి ఎలాంటి రక్షణ కల్పించపోవడంతో ఆ వాహనాలు ఎండకు ఎండి.. వానకు నాని తప్పుపడుతున్నాయి. దీంతో ఆ పోలీస్‌స్టేషన్లు గుజిరీ షెడ్డును తలపిస్తున్నాయి. అంతేకాకుండా ఆ వాహనాల్లో ముఖ్యమైన, విలువైన సామగ్రి గల్లంతు అవుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.



ఓడీసీ చెరువు ప్రాంతంలో నిల్వ ఉన్న మురుగు



గాజుకుంటపల్లి వీధిలో..



గాజుకుంటపల్లి నీటిట్యాంక్ వద్ద..

కంపుకొడుతున్న పల్లెలు

- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- దోమలతో బెంబేలెత్తుతున్న గ్రామీణులు

ఓబుళదేవరచెరువు, జూలై 28: వర్షాకాలం.. వర్షపు నీటితో పాటు మురుగునీరూ నిల్వ ఉంటుండటంతో గ్రామీణులు రోగాలబారిన పడుతున్నారు. మండలంలోని 14 పంచాయతీల్లో సగానికి పైగా పంచాయతీల్లోని గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. దీంతో దోమలు పెరిగి, మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర వ్యాధులు సోకి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రైవేటు వైద్యశాలలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పల్లెల్లో పారిశుధ్యం లోపించింది. ప్రధానంగా వీధుల్లో తాగునీటి కొళాయిల వద్ద, ట్యాంకర్ల వద్ద మురుగు పేరుకుపోతోంది. మండల కేంద్రంలోని చెరువు మరవ ప్రాంతాల్లో మురుగు పేరుకుపోవడంతో పందులు సంచ రిస్తున్నాయి. దుర్వాసన భరించలేకున్నామని ఆయా ప్రాంతాల వాసులు వాపోతున్నారు. మురుగునీటి కాలువపై రాళ్ల అడ్డదిడ్డంగా ఉండడంతో మురుగు ముందుకు పోక వీధుల్లో ప్రవహిస్తోందని వాపోతున్నారు. అధికారులు నామమాత్రం చర్యలు తీసుకొని చేతులు దులిపే సుకొంటుండటంతో సమస్య మళ్లీ మొదటికి వస్తోంది. గాజుకుంటపల్లి, వెంకటాపురం నీటి ట్యాంక్‌ల చుట్టుమురుగు పేరుకుపోవడంతో దోమలు అధికమయ్యాయి. కొండకమర్లలో చాలా వీధుల్లో మురుగునీటి కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ఎగువ ఎస్సీకాలనీ వారు వాపోతున్నారు.

నిధుల కొరత

గత వైసీపీ ప్రభుత్వం సర్పంచ్‌లకు కేటాయించిన నిధులను దారి మళ్లించడంతో గ్రామాల్లో అభివృద్ధి, పారిశుధ్య పనులు కుంటుపడ్డాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలాభివృద్ధి, పారిశుధ్యంపై దృష్టి సారించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.



దుర్గంధం భరించలేకున్నాం

చెరువు మరవ ప్రాంతంలో మురుగుతో దుర్వాసన భరించలేక పోతున్నాం, ఇళ్లముందే మురుగునీటి కాలువ ఉండడంతో, కాలువ అస్తవ్యస్తంగా ఉండడంతో వీధుల్లోకి మురుగు వస్తోందన్నారు. దోమలు అధికంకావడంతో జ్వరాల బారిన పడుతున్నాము. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలను శుభ్రంచేసి, మురుగు తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

- క్రిష్టయ్య, ఓబుళదేవరచెరువు



చర్యలు శూన్యం

మండలంలోని చాలా పంచాయతీల్లోని గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. దీంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. అపరిశుభ్రతను నివారించాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. మండల కేంద్రం పూర్తిగా అపరిశుభ్రంగా మారింది. ప్రధానంగా కదిరి హిందూపురం రహదారిపై కొన్ని నెలలుగా మురుగునీరు ప్రవహిస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకముందే అధికారులు తగు చర్యలు చేపట్టాలి.

- మున్నా, ఆర్పీపీ డివిజన్ కార్యదర్శి

భక్తిశ్రద్ధలలో పెద్దమ్మ, దుర్గమ్మకు బోనాలు



ధర్మవరంలో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు



కమ్మవారిపల్లిలో గంగమ్మకు జ్యోతులు, బోనాలు సమర్పిస్తున్న గ్రామస్థులు

ధర్మవరం, జూలై 28: ఆషాఢ మాసం సందర్భంగా పెద్దమ్మ, దుర్గమ్మ అమ్మవార్లకు ఆదివారం బోనాలు సమర్పించారు. 14వ వార్డుకు చెందిన మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా దుర్గమ్మ,పెద్దమ్మ అలయాలకు వెళ్లి అక్కడ బోనాలను సమర్పించారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అలయాల ఎదుట నిమ్మకాయలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో చింతపులును పెద్దన్న, మాజీ కౌన్సిలర్ బుగ్గనాగరాజు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండలంలోని కమ్మవారిపల్లిలో గంగమ్మకు ఆదివారం జ్యోతులు, బోనాలు సమర్పించారు. గ్రామ సమీపంలోన నూతనంగా గంగమ్మ గుడి నిర్మించి, ప్రతిష్ఠించారు. 41 రోజులు పూర్తికావడంతో గ్రామస్థులు మూకుమ్మడిగా జ్యోతులు, బోనాలను ఊరేగింపుగా వెళ్లి.. గంగమ్మకు సమర్పించారు.

అందుబాటులో మందులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి, జూలై 28: గర్భిణులకు అవసరమైన మందులన్నింటినీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కలెక్టరేట్లో ఆమె మాట్లాడుతూ.. పేద మహిళలు నెలలు పూర్తికాకనే ప్రసవ సమయంలో ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ విషయాన్ని జడ్పీ సమావేశంలో కలెక్టరు దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. ఇందుకు కలెక్టరు చేతన్ వెంటనే స్పందించి అవసరమైన మందులను ఆయా ఆసుపత్రుల్లో ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



ఉమామహేశ్వర్ రెడ్డి (ఫైల్)

ముదిగుబ్బ, జూలై 28: మండలంలోని సంకేపల్లి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి కుమారుడు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉమామహేశ్వర్‌రెడ్డి (32) శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. గతంలో బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. కరోనా సమయం నుంచి స్వగ్రామంలోనే ఉంటూ.. వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నాడు. ఇంటి సరుకులు తెచ్చేందుకు ద్విచక్ర వాహనంలో సంకేపల్లి నుంచి ముదిగుబ్బకు శనివారం రాత్రి వెళ్తుండగా... కస్తూర్బా పాఠశాల సమీపంలో బైక్ అదుపు తప్పింది. దీంతో బైక్ డివైడర్‌ను ఢీకొనడంతో ఉమామహేశ్వర్‌రెడ్డి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న వారు గుర్తించి.. అతని బంధువులకు సమాచారం ఇచ్చారు. ఉమామహేశ్వర్‌రెడ్డిని బంధువులు ఓ ప్రైవేట్ వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. తండ్రి నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యతీంద్ర తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..



ఆదిశేషయ్య (ఫైల్)

పుట్టపర్తిరూరల్, జూలై 28 : మండలంలోని వెంగళమ్మ చెరువులో చికెన్ సెంటర్ నిర్వాహ కుడు, టీడీపీ కార్యకర్త ఆదిశేషయ్య (41) ఆదివారం ఉదయం విద్యు దాఘాతంతో మరణించాడు. చికెన్ సెంటర్‌లో క్లీనింగ్ మిషన్‌లో శుభ్రమైన కోళ్లను బయటకు తీస్తూ విద్యుదా ఘాతానికి గురయ్యాడు. స్థానికులు అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందనట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. మృతదేహాన్ని రూరల్ పోలీసులు పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పుట్టపర్తి రూరల్ ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. కాగా, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆదిశేషయ్య స్వగ్రామమైన చెర్లోపల్లికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు.

అబాకస్ పోటీల్లో ధర్మవరం విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం, జూలై 28: రీజనల్ లెవెల్ అబాకస్ కాంపిటేషన్‌లో ధర్మవరం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ధర్మవరం మిరాకల్ ఎడ్యుకేషన్ సెంటర్ డైరెక్టర్ శ్రీవాణి, ఫ్రాంచైజీ చంద్రశేఖర్ తెలిపారు. తాడిపత్రిలో ఆదివారం నిర్వహించిన 10వ రీజనల్ లెవెల్ అబాకస్ కాంపిటేషన్‌లో ధర్మవరం మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ విద్యార్థులు దివేష్, లోహిత్ చాంపియన్ ఆఫ్ చాంపియన్ సాధించగా, ఫలశ్రుతి, బ్రితిక, మేఘాంస్ చాంపియన్స్ అయ్యారు. సాయినిత్య, అజయ్, వాన్మాయి, ఆదిత్య, మోనిత్, కీర్తి, మోక్షజ్ఞు, గౌరవ్, ఆరాధ్య, జయదీప్, మోనిష, ధన్విన్, తేజేష్, రుత్విక్ టాపర్స్‌గా నిలిచారన్నారు. విజేతలకు తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్, ఎంఈఓ నాగరాజు ట్రోఫీలను అందించారన్నారు.



అబాకస్ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు

పథకాలకు మహనీయుల పేర్లు భేష్

ధర్మవరం, జూలై 28: ప్రభుత్వ పథకాలకు స్ఫూర్తిప్రధా తలు, మహనీయుల పేర్లు పెట్టిన నారాలోకేశ్‌కు మంత్రి సత్యకుమార్‌యాదవ్ ట్విట్టర్‌లో అభినందనలు తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కాసీతమ్మ, ఆబ్దుల్‌కలాం పేర్లను పథకాలకు పెట్టడం వారిని గౌరవించడమేనన్నారు. ప్రతి పథకానికి తన కుటుంబపేర్లు పెట్టుకుని స్వలాభం కోసం వాడుకున్న గత పాలకుడిలా కాకుండా సమాజానికి మేలు చేసినవారి పేర్లు గుర్తుండిపోయేలా లోకేశ్ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని కొనియాడారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ధర్మవరం, జూలై 28: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ పేర్కొన్నారు. ధర్మవరం సైక్లింగ్ అండ్ వాకర్స్ క్లబ్ (డీసీవీసీ) సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎల్-1 కాలనీలోని ప్రభుత్వ స్థలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో డీసీవీసీ సంస్థ గౌరవాధ్యక్షుడు గోరకాటిపెద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డివారిపల్లిలో చోరీ

నంబులపూలకుంట : మండల కేంద్రానికి సమీపంలోని ఎన్ రెడ్డివారిపల్లిలో శనివారం రాత్రి హసీనా ఇంటిలో చోరీ జరిగింది. మండలంలోని తూపల్లిలో మొహరం జరుగుతుండగా, బంధువుల ఇంటికి హసీనా వెళ్లింది. దుండగులు ఆ ఇంటి తాళాలు పగలకొట్టి బీరువాలో ఉన్న రూ. ఐదు వేలు నగదు చోరీ చేశారు. చీరలకు నిప్పు పెట్టివెళ్లిపోయాడు. ఇంట్లో నుంచి పొగవస్తుంటాన్ని గమనించిన స్థానికులు హసీనాకు సమా చారం చేరవేశారు. ఆమె వచ్చే సరికి చీరలు పూర్తిగా కాలిపోయాయి. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

నేడు సీపీఐ రామకృష్ణ రాక

బత్తలపల్లి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ బత్తలపల్లికి సోమవారం వస్తున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బత్తలపల్లిలోని 401 సర్వేనెంబర్‌లో మఠం భూముల్లో పేదలు గుడిసెలు వేసుకున్న వారికి మద్దతుగా భూపోరాటంలో ఆయన పాల్గొంటున్నారన్నారు. కావున సీపీఐ నాయకులు, కార్యకర్తలు, పేదలు తరలిరావాలని యన పిలుపునిచ్చారు.

కాసిరెడ్డినాయన తిరునాళ్ల

గాండ్లపెంట, జూలై 28: స్థానిక కాసిరెడ్డినాయనస్వామి తిరునాళ్లను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. కాసిరెడ్డి నాయన చిత్రపటాన్ని స్థానిక ఆర్డీటీ కార్యాలయం నుంచి కదిరి, రాయచోటి ప్రధాన రహదారిలోని పెద్దమిట్ట వద్ద వేసిన కాసినాయన ఆశ్రమం వరకు చాందీని బండిపై ఊరేగించారు. రాత్రి భక్తి పాటలు, భజనలు, సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలను మంగళవారం వరకూ నిర్వహిస్తామని, ప్రతి రోజూ భక్తులకు అన్నదానం ఉంటుందని పూజారి చంద్ర తెలిపారు. సోమవారం ఎద్దుల పరుగుపందెలు, మంగళవారం ఉట్ల పరున, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.





ప్రత్యేకంగా అలంకరించిన చాందీని బండి, కాసిరెడ్డినాయన విగ్రహం (ఇన్‌సెట్లో)



ఓడీసీలో పీర్ల ఊరేగింపు



నల్లచెరువులో జలధికి తరలుతున్న పీర్లు

జలధికి తరలిన పీర్లు



గుండువారిపల్లిలో పీర్ల అలంకరణ



చౌటకుంటపల్లిలో..

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: నంబులపూలకుంట మండలంలోని ముండ్లవా రిపల్లిలో ఆదివారం జలధి కార్యక్రమా న్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున పీర్లతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం జలధికి తరలి వెళ్లాయి. చిన్న పీర్ల పండుగను తాడిమర్రిలో ఘనంగా నిర్వహించారు. ముస్కీన్‌వలీ స్వామి పీర్లను అందంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం వరకు గ్రామంలో ఊరేగించిన అనంతరం జలధీ కార్యక్రమం నిర్వహించారు. అమడగూరు మండలపరిధిలోని చినగానిపల్లి, గుండువారిపల్లిలో ఆదివారం జలధి ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామాల్లో పీర్లను ఊరేగించిన అనంతరం జలధికి తరలించారు. నల్లచెరువు మండలంలోని నల్లచెరువు, అల్లుగుండు, పంతులచెరువు, ఇందుకురివాండ్లపల్లి, బాలేపల్లి తండాల్లో ఆదివారం మొహరం పండుగ సందర్భంగా జలధి నిర్వహించారు. నల్లమాడ మండలంలోని చౌటకుంటపల్లి, పెమనకుంటపల్లి, దొన్నికోట, రెడ్డిపల్లి గ్రామాల్లో ఆదివారం ఘనంగా జలధి నిర్వహించారు. ఓబుళదేవరచెరువు మండలంలోని ఓడీచెరువు, తంగేడుకుంట, ఎం.కొత్తపల్లి గ్రామాల్లో ఆదివారం జలధి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



ముండ్లవారిపల్లితో జలధికి తరలుతున్న పీర్లు



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి, ఎమ్మెల్యే

పాఠశాలను తనిఖీ చేసిన మంత్రి

మడకశిర రూరల్, జూలై 28: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మండలంలోని గుండుమల గ్రామంలోగల మహాత్మా జ్యోతిరావ్‌పూలే గురుకుల పాఠశాలను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి పాఠశాలలో సౌకర్యాలపై ఆరాతీశారు. గుండుమల గ్రామ సమీపంలో అర్ధంతరంగా ఆగిపోయిన బాలుర గురుకుల పాఠశాల నిర్మాణాన్ని పరిశీలించారు. త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. మడకశిర పర్యటనలో ఉన్న మంత్రి బాలాజీ నగర్‌లోని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఇంటికెళ్లారు. అక్కడే భోజనం ముగించుకొన్న అనంతరం మంత్రిని కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, నాయకులు శ్రీనివాసమూర్తి, సామకోటి ఆదినారాయణ. మాజీ సర్పంచ్ గుండుమల చంద్రప్ప పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం: మంత్రి

గుండుమల గ్రామ సమీపంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులో సాగు చేస్తున్న పొలాలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తే అధిక లాభాలు సాధించవచ్చన్నారు. అనంతరం మంత్రి స్వయంగా పొలంలో విత్తనాలు నాటారు.

ముగిసిన టీచ్‌టూల్ కార్యక్రమం



ఉపాధ్యాయురాలు సుబ్బలక్ష్మిని సన్మానిస్తున్న ఎంఈఓ తదితరులు

హిందూపురం అర్బన్, జూలై 28: ఉపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి ఎందరికో ఆదర్శంగా నిలిచారని ఎంఈఓ గంగప్ప కొనియాడారు. టీచ్‌టూల్ కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం రాత్రి ఉపాధ్యాయురాలు సుబ్బలక్ష్మిని ఎంఈఓ ఘనంగా సన్మానించారు. పరిగి మండలం ఎన్ ముద్దిరెడ్డిపల్లిలో విధులు నిర్వహించే సమయంలో ఆమె పాఠశాలలో నందిని అనే రైతు కుమార్తెకు కేన్సర్ అని వైద్యులు ధ్రువీకరించారని, బాలిక బాధను చూసి చలించిపోయిన ఉపాధ్యాయురాలు అందరి సహకారం తీసుకొని, సీఎం ఆర్థికసాయం తెప్పించి కాపాడారన్నారు. ఆమె ప్రస్తుతం పోచనపల్లి పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్నారన్నారు. అందరూ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

సోమందేపల్లి, జూలై 28: స్థానిక ఘనగిరి పాఠశాలలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య మూర్ఛవ్యాధి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 10 గంటలకు నిర్వహించిన ఈ శిబిరంలో బెంగళూరుకు చెందిన అక్షయ న్యూరో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యురాలు నీలేఖ్య రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందించారు. శిబిరానికి వివిధ ప్రాంతాల నుంచి 32 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి హరి, జోనల్ ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్, అధ్యక్షుడు, నవి, లెక్చరర్ రామన్న, యూటీఎఫ్ రమేష్, బాబా, యశ్వంత్, నాగార్జున, కృష్ణమూర్తి, పాఠశాల కరెస్పాండెంట్ ఇలియాజ్ హాజరయ్యారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆరోగ్యమైత్రి కూటమి విజయోత్సవ వేడుకలు

మడకశిర(అమరాపురం), జూలై 28: అమరాపురం వైద్య ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో 200 ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాలను ఆదివారం పూర్తి చేసుకొన్న సందర్భంగా వైద్యులను ఘనంగా సన్మానించారు. సన్మాన సభ కార్యక్రమాన్ని వీరశైవ కల్యాణ మండపం నందు సభ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌డీఎన్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించారు. దాదాపు 19 సంవత్సరాలు నిర్విరామంగా 200 ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. 180 ఉచిత వైద్య శిబిరాల్లో వైద్య సేవలందించిన డాక్టర్ జ్యోతి విజయకుమారి, 80 వైద్య శిబిరాల్లో పాల్గొన్న డాక్టర్ జింకా కృష్ణమోహన్, డాక్టర్ ఓంకార్‌నాయక్ తదితరులను ఘనంగా సన్మానించారు.

భక్తిశ్రద్ధలలో పెద్దమ్మ, దుర్గమ్మకు బోనాలు



బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

ధర్మవరం, జూలై 28: ఆషాఢ మాసం సందర్భంగా పెద్దమ్మ, దుర్గమ్మ అమ్మవార్లకు ఆదివారం బోనాలు సమర్పించారు. 14వ వార్డుకు చెందిన మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా దుర్గమ్మ,పెద్దమ్మ అలయాలకు వెళ్లి అక్కడ బోనాలను సమర్పించారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయాల ఎదుట నిమ్మకాయలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో చింతపులుసు పెద్దన్న, మాజీ కౌన్సిలర్ బుగ్గనాగరాజు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండలంలోని కమ్మవారిపల్లిలో గంగమ్మకు ఆదివారం జ్యోతులు, బోనాలు సమర్పించారు. గ్రామ సమీపంలోన నూతనంగా గంగమ్మ గుడి నిర్మించి, ప్రతిష్ఠించారు.

నిధుల్లేవ్..విధుల్లేవ్..!



● వైసీపీ పాలనలో ఉత్సవ విగ్రహాలుగా ఎంపీటీసీలు ● మూడేళ్లు గడుస్తున్నా చిల్లిగవ్వ రాకపాయె..
● టీడీపీతోనే న్యాయం జరుగుతుందంటున్న ప్రజాప్రతినిధులు ● అభివృద్ధి కోసమే టీడీపీ వైపు..

చిలమత్తూరు, జూలై 28: గ్రామీణ ప్రజలకు ప్రజా సేవ చేయాలన్న కోరికతో పదవులు చేపట్టిన ప్రజా ప్రతినిధులకు వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర నిరాశే మిగిలింది. ఎన్నికై మూడేళ్ల కాలం కావస్తున్నా తమ సెగ్మెంట్లను అభివృద్ధి చేసుకునేందుకు నిధులు..విధులూ కల్పించకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కనీసం ప్రభుత్వ కార్యాలయాల్లో గౌరవమైనా దక్కుతుందనుకుంటే అదీకూడా అడియాశగానే మారింది. 2021 ఏప్రిల్ 8న ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో మండలంలోని 15 ఎంపిటీసీ స్థానాల్లో 15 స్థానాలను వైసీపీ కైవశం చేసుకుంది.



చిలమత్తూరు మండల పరిషత్ కార్యాలయం

మూడేళ్లు గడిచినా..

ఎంపీటీసీలుగా గెలిచి మూడేళ్లు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఎంపీటీసీలు లోలోపల మధనపడుతున్నారు. ప్రత్యేకంగా నిధులు లేవు...విధులు లేవు. గ్రామ పంచాయతీల్లో కూర్చోందామంటే కనీసం ఎంపీటీసీలకు ప్రత్యేకంగా కుర్చీలు లేకుండా పోయాయి. గ్రామాల్లో చిన్న చిన్న పనులు కూడా చేయలేని పరిస్థితి నెలకొనడంతో ఎంపీటీసీలు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిషత్ సమావేశాల్లో ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లినా వాటిని పరిష్కరించిన దాఖలాలు లేవు.

పదవి ఉన్నా.. లేనట్టే..

ఎంపీటీసీల పదవీ కాలం ఇప్పటికే మూడేళ్ల కాలం గడిచిపోయింది. మండల పరిషత్‌కు గతంలో బీఆర్‌జీఎఫ్ తలసరి గ్రాంట్ జనరల్ ఫండ్, స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్, 14వ ఆర్థిక సంఘం నిధులు సమకూరేవి. దీంతో గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, అంతర్గత రహదారుల నిర్మాణాలు చేపట్టేవారు. ప్రస్తుతం ఆ నిధులన్నీ ఎంపీటీసీల ప్రమేయం లేకుండా నేరుగా గ్రామ పంచాయతీలకు ఇస్తుండటంతో వారికి గౌరవం కూడా లేకుండా పోయింది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 20 శాతం ఎంపీటీసీలకు ఇవ్వాల్సిందిగా కేంద్రం సూచించినా అప్పటి వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేదు. ఎంపీటీసీలకు నిధుల వాటా 25 శాతం పెంచాలన్న విజ్ఞప్తిని పట్టించుకోలేదు. ప్రత్యేక నిధులు కేటాయిస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటన చేసినప్పటికీ అదీ కార్యాచరణ దాల్చలేదు. ఎంపీటీసీ పదవి ఉన్నా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోతున్నామని ఎంపీటీసీలు వాపోతున్నారు.

నిధుల కోసం వినతులు

ఏదోరకంగా తమ హామీలను నిలబెట్టుకొని ప్రజల్లో గౌరవం పొందాలనుకున్న ఎంపీటీసీకు అడుగడుగునా నిరాశే ఎదురైంది. గ్రామాల్లో వారికి ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని వినతులు ఇస్తున్నా వాటికి స్పందన రావడం లేదు. కనీసం సిసి రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటుచేద్దామన్నా నిధులులేవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మండల పరిషత్‌కి పెద్దగా నిధులు మంజూరు కాకపోవడంతో, సాధారణ నిధులు కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో వారు ఏ పని చేయలేకపోయారు. గత ప్రభుత్వ హయాంలో ఎంపీటీసీలకు ఒక్క పైసా కూడా విదల్చకపోవడంతో వారు ఆవేదనకు గురవుతున్నారు.

టీడీపీతోనే న్యాయం జరుగుతుందని..

స్థానిక సంస్థలను బలోపేతం చేసిన ఘనత టీడీపీదే అని ఏ నాయకుడికైనా బలమైన నమ్మకం. స్థానిక ప్రజాప్రతినిధులకు అవసరమైన నిధులు కేటాయించిన ఘనత చంద్రబాబుదే. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో గెలిచిన ప్రజాప్రతినిధులు అప్పుల పాలవడంతో పాటు వారి చుట్టూ ఉన్న ప్రజలకు చెప్పుకోవడానికి ఒక్క పని కూడా చేసిన దాఖలాలు లేకుండా పోయాయి. దాంతో తీవ్ర నిరాశకు గురైన సర్పంచులు, ఎంపీటీసీలు తమ గ్రామాలను అభివృద్ధి చేసుకోవడానికి అధికార పార్టీ పక్షాన చేరుతున్నారు. టీడీపీతో జత కలిసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకునేందుకు వైసీపీలో ఉన్న ఎంపీటీసీలు టీడీపీలో చేరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ సహకారంతో వారు తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవడానికి సిద్ధపడుతున్నారు.

కార్మికులకు ఆరోగ్య, ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏఐయూటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్

మడకశిరటౌన్, జూలై 28: జిల్లావ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు ఉన్నా ఈఎస్ఐ ఆస్పత్రి లేకపోవడంతో కార్మికులకు ఆరోగ్య భద్రత కరువయ్యిందని ఏఐయూటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, రాష్ట్ర ఇన్‌ఛార్జి సుధీర్ పేర్కొన్నారు. ఆదివారం మడకశిర పట్టణంలోని ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి ప్రథమ మహాసభను నిర్వహించారు. ఈసందర్భంగా వారు పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కరువయ్యిందని, వారికి శాశ్వతమైన ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కూడా కార్మికులు కర్షకులకు పేదవారికి ఏమాత్రం న్యాయం చేసేవిధంగా లేదన్నారు. కార్మికులు ఐక్యమై సమాజ మార్పు కోసం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, దీంతో కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొవల్సి వచ్చిందన్నారు. కార్మిక శక్తి లేనిదే సమాజం ముందుకు నడవదని, అయితే కార్మికులు ఈరోజు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, చట్టాలన్నీ కూడా కార్మికులకు వ్యతిరేకంగా మారుస్తున్నారని విమర్శించారు. సంఘటితంగా హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందన్నారు. పట్టణంలోని అమరాపురం బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు గిరీష్, నియోజకవర్గం అధ్యక్షుడు సి.ఎల్.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు హరిప్రసాద్, కార్యదర్శి అశోక్, ట్రెజరర్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు అశోక్

మొక్కలు నాటి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ

హిందూపురం అర్బన్, జూలై 28: విశ్వంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రి ఒక్కరూ ఒక్క మొక్కను నాటి వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని ఐక్య సంఘాల ప్రతినిధులు, పర్యావరణ ప్రేమికులు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం పెనుకొండ రోడ్డులోని నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో, అఖిల భారత షాహిద్ టిప్పుసుల్తాన్ సంస్థ అధ్యక్షుడు ఉమర్ నేతృత్వంలో 10 వేల మొక్కలు అందించారు. ఈ సందర్భంగా పర్యావరణ వేత్త భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ.. భూమిమీద సమస్త జీవరాసులకు మొక్కలతోనే జీవనం, జీవితం అన్నారు. ఆది కాలం నుంచి మానవుని మనుగడ చెట్టు తొర్రల్లోనే ప్రారంభమైందన్నారు. భావితరాలకు మనుగడ చెట్లతోనే అన్నారు. కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికుడు భాస్కర్‌రెడ్డి, ఆధ్యాత్మిక గురూజీ అశ్వత్థనారాయణ, పర్యావరణవేత్త డా.శంకర్‌నారాయణ, ఎంఈఓ గంగప్ప, క్రైస్తవ సంఘం నాయకుడు నాగేంద్ర, సిక్కు సంఘం నాయకులు పర్మీందర్‌సింగ్, జమీల్, మౌలాన, ఉస్మాన్ ఘని, ఇస్మాయిల్, టీడీపీ పట్టణాధ్యక్షుడు డీఈ రమేష్, జనసేన నాయకుడు నిమ్మకాయల రాము, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు విద్య, డాక్టర్ శ్రీవాణి, భువనేశ్వరీ, ఫైరోజ్ చరణ్ పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న దాతలు

శిశువు మిస్సింగ్ కలకలం

● స్నేహితురాలి బిడ్డను చూసేందుకు వచ్చి మరొకరి శిశువును ఎత్తుకెళ్లిన మహిళ
● సీసీ పుటేజీ ద్వారా నిందితురాలి గుర్తింపు
● బిడ్డను తల్లి ఒడికి చేర్చిన పోలీసులు

అనంతపురం టౌన్, జూలై 28: జిల్లా సర్వజనాస్పత్రిలో ఐదు రోజుల పసికందు అదృశ్యమైన సంఘటన ఆదివారం కలకలం రేపింది. పోలీసులు మూడు గంటల్లోను కేసును ఛేదించి, బిడ్డను తల్లి ఒడికి చేర్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం నాగలూరు గ్రామానికి చెందిన అమృత ప్రసవం కోసం ఈనెల 23న అనంత జిల్లా ఆస్పత్రికి వచ్చింది. ఆమె అదేరోజు ఆడ శిశువును ప్రసవించింది. తొలి మూడురోజులు ఐసీయూలో ఉంచి రెండురోజుల కిందట సాధారణ లేబర్‌వార్డుకు మార్చారు. ఆదివారం తెల్లవారుజామున పసిపాప కనబడకుండా పోయింది. దీంతో ఆస్పత్రిలో కలకలం రేగింది. వెంటనే వైద్యాధికారులు, పోలీసులకు సమాచారం వెళ్లింది. డీఎస్పీ ప్రతాప్, సీఐలు క్రాంతికుమార్, ప్రతాప్‌రెడ్డి తమ సిబ్బందితో రంగంలోకి దిగారు. ఆస్పత్రిలో ఉన్న సీసీ పుటేజీని పరిశీలించారు. అందులో పాపను ఎత్తుకెళ్లిన మహిళను గుర్తించారు.

● అన్నం తెచ్చిన సంచిలోనే ...

ఆమని అనంతపురం రూరల్ మండలం నారాయణపురంలో ఉంటున్నారు. ఇంటిపక్కనే ఉంటున్న తన స్నేహితురాలి కుమార్తె శ్రుతి ఆస్పత్రిలో డెలివరీ కావడంతో ఆమెను చూసేందుకు శనివారం వచ్చింది. భోజనం క్యారియర్‌తో పాటు ఓ సంచి కూడా తీసుకువచ్చింది. రాత్రి బాలింతతో పాటు ఆమె తల్లి, ఆమని కలిసి ఆనందంగా మాట్లాడుకుంటూ అన్నం తిన్నారు. అదే సమయంలోనే పక్క బెడ్‌పై ఉన్న నాగలూరుకు చెంది న బాలింత అమృత, ఆమె తల్లితో ఆ మని పరిచయం పెంచుకుంది. ఇంతకుముందే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, మళ్లీ కుమార్తె పుట్టిందని అమృత తల్లి శకుంతల ఆమని వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. ఈక్రమంలో ఆమని తెల్లవారుజామున మూడుగంటల సమయం లో అందరూ నిద్రిస్తుండగా అమృతకు పుట్టిన శిశువును క్యారియర్ తెచ్చిన సంచి లో ఉంచుకొని ఎత్తుకెళ్లింది. ఆస్పత్రినుంచి నేరుగా నారాయణపురంలో ఉన్న స్నేహితురాలి బంధువు ఇంటికి వెళ్లి అక్కడ ఆ పాపను ఉంచింది. ఎవరికీ అనుమానం రాకుండా తిరిగి ఆస్పత్రికి చేరుకొంది. అయితే సీసీ పుటేజీలో ఆమ ని ఓ సంచి తీసుకెళ్లడం గుర్తించిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని విచారించారు. అదే సమయంలో నారాయణపురం గ్రామంలోని తమ ఇంటిలో పసిపాపను ఉంచినట్లు ఆ ఇంటి యజమానులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ, సీఐలు అక్కడకు వెళ్లి ఆ చిన్నారిని తీసుకొచ్చి, తల్లికి అప్పగించారు. ఆ పాపను ఆస్పత్రిలోని ప్రత్యేకవార్డులో ఉంచి వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. చిన్నారి ఆరోగ్యంగా ఉన్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.



పాపను స్వాధీనం చేసుకున్న పోలీసులు

● నలుగురిపై వేటు

ఆస్పత్రిలో పాప మిస్సింగ్ వ్యవహారంలో నలుగురిపై వేటు పడింది. వార్డులో రాత్రిడ్యూటీలో ఉన్న ఇద్దరు స్టాఫ్‌నర్సులు శ్రవణమ్మ, సువర్ణమ్మలను సస్పెండ్ చేశారు. ఎఫ్ఎన్ఓ సుజాత, మహిళా సెక్యూరిటీ గార్డు సునీతను విధుల్లో నుంచి తొలగించినట్లు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు.

నీవు లేక.. నేను లేను!

● తమ్ముడి మృతిని తట్టుకోలేక అన్న ఆత్మహత్య

యాడికి, జూలై 28: తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక అన్న దాసరి చంద్ర (58) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని లక్షుంపల్లి గ్రామంలో జరిగింది. ఈ సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు మండలంలోని లక్షుంపల్లి గ్రామానికి చెందిన దాసరి చంద్ర, దాసరి బలరాముడు అన్నదమ్ములు. ఇద్దరూ వేర్వేరుగా నివసిస్తున్నారు. అన్నదమ్ములిద్దరూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. కష్టసుఖాల్లో అన్నదమ్ములిద్దరూ ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉండేవారు. ఈ నెల 26న దాసరి బలరాముడు గుండె పోటుతో మృతిచెందాడు. తమ్ముడి మరణాన్ని జీర్ణించుకోలేక దాసరి చంద్ర విలవిలలాడిపోయాడు. తమ్ముడి అంత్యక్రియలకు వెళ్లాడు. అయితే ఇంటికి తిరిగి వెళ్లలేదు. ఎక్కడికో వెళ్లి ఉంటాడు.. వస్తాడులే అని కుటుంబ సభ్యులు భావించారు. పనుల కోసం ఆదివారం ఉదయం తోట వద్దకు వెళ్లారు. అక్కడ చెట్టుకు ఉరివేసుకుని ఉన్న దాసరి చంద్రను గమనించి బోరున విలపించారు. తమ్ముడి మరణాన్ని తట్టుకోలేకనే దాసరి చంద్ర ఆత్మహత్య చేసుకున్నాడని వారు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. దాసరి చంద్ర కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.



గుండె పోటుతో మృతిచెందిన బలరాముడు (ఫైల్)



ఆత్మహత్య చేసుకున్న చంద్ర (ఫైల్)

గొరవయ్యలకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై28: జీవోపాధి లేక బతుకుతెరువు భారమై యాచక వృత్తిని ఎంచుకుంటున్న గొరవయ్యలకు ప్రతినెలా రూ.10 వేలు అందించి ఆదుకోవాలని మంత్రి సత్యకుమార్‌ను ఉరవకొండ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కొనకొండ్ల రాజేష్ కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లాకొచ్చిన మంత్రిని గొరవయ్యలతో కలిసి రాజేష్ కలిసి సమస్యలను విన్నవించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది గొరవయ్యలు దీన పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. గొ రవయ్యలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రతినెలా రూ.10 వేలు గౌరవ వేతనం అందించాలని కోరారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ... సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు రాజేష్ తెలిపారు.

అవోపా జిల్లా అధ్యక్షుడిగా వెంకటేష్‌బాబు

అనంతపురం కల్చరల్, జూలై 28: ఆర్యవైశ్య అఫీషియల్స్, పెన్షనర్స్ అసోసియేషన్ (అవోపా) జిల్లా నూతన అధ్యక్షుడిగా భవనాసి వెంకటేష్‌బాబు ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం అవోపా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఫైనాన్స్ కార్యదర్శి శంకరనారాయణ, చీఫ్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు సమక్షంలో నూతన అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లా నూతన అధ్యక్షుడుగా వెంకటేష్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షుడు జయంతి శ్రీనివాసులుశెట్టి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీరామ్ సుధాకర్, జనార్ధన్, మంజునాథ్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

న్యాయం చేయండి..

● బిడ్డ సహా భర్త ఇంటి ముందు ఆందోళన

పెనుకొండ రూరల్, జూలై 28: తనకు, తన బిడ్డకు న్యాయం జరగాలని కోరుతూ చాకలి కవిత అనే వివాహిత ఆదివారం రొద్దం మండలంలోని సానిపల్లి గ్రామంలో భర్త ఇంటి ముందు బైఠాయించి ఆందోళన వ్యక్తం చేసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు, సానిపల్లి గ్రామానికి చెందిన కురుబ వెంకటస్వామి మూడు సంవత్సరాల క్రితం సోమందేపల్లికి చెందిన చాకలి అనితతో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె. కొన్ని నెలలుగా భార్య భర్తలు కుటుంబ కలహాల నేపథ్యంలో వెంకటస్వామి భార్య కవితను పుట్టింటికి పంపేశారు. అయితే వెంకటస్వామి కొన్ని రోజులుగా రాకపోవడంతో మనస్థాపానికి గురై ఆదివారం కవిత తన కుమార్తెను వెంట పెట్టుకొని భర్త ఇంటి ముందు కూర్చొని ఆందోళన వ్యక్తం చేసింది. తనకు న్యాయం జరిగేవరకు ఇక్కడ నుంచి కదిలేది లేదంటూ ఆందోళన చేపట్టింది. చుట్టుపక్కల వారు జరిగిన విషయంపై ఆమెతో చర్చించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరు కుటుంబ సభ్యులను పోలీసు స్టేషన్‌కి పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ విషయంపై ఎస్.ఐ వలీభాషాను వివరణ కోరగా భార్య భర్తని పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు.



భర్త ఇంటి ముందు బైఠాయించిన కవిత

జలధికి తరలిన పీర్లు

పెనుకొండ రూరల్, జూలై 28: మొహరం పండుగను పురస్కరించుకొని మండలంలోని కురుబవాండ్లపల్లిలో ఆదివారం పీర్లస్వాములను జలధికి తరలించారు. మొహరం పండుగ సందర్భంగా గ్రామంలో పీర్ల చావడిని ఏర్పాటుచేసి అగ్ని గుండం త్రవ్వారు. ఆదివారం జలధి కావడంతో గుండం ముందు చిన్నారుల నుంచి పెద్దల వరకు అలావు తొక్కారు. మహిళలు భక్తి శ్రద్ధలతో పీర్ల స్వాములకు చక్కెర చదివింపులు చేశారు. అనంతరం పీర్ల స్వాములను ఎత్తుకొని అగ్నిగుండం దాటారు. సానిపల్లిలో పండుగను పరుష్కరించుకొని గ్రామ వీధుల గుండా పీర్లను ఊరేగించారు. చక్కెర చదివింపుల అనంతరం జలధికి తరలించారు.

సోమందేపల్లి : మండట కేంద్రంలోని పాత ఊరులో ఆదివారం జలధి వేడుకలు ఘనంగా జరిగాయి. పీర్ల చావిడి వద్ద స్వాములను ఊరేగించారు. డప్పులు మేళతాళాల మధ్య భక్తులు చిందులు వేస్తూ సమీప చెరువులోకి తీసుకెళ్లి జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రసాదాల వినియోగం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ నూరి, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

వచ్చీరాని వైద్యంతో అనర్థాలు

● ఆర్ఎంపీల సమావేశంలో ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ

హిందూపురం అర్బన్, జూలై 28: వచ్చీ రానివైద్యం చేసి అనర్థాలను సృష్టించవద్దని శ్రీ సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జ్ డీఎంహెచ్ఓ మంజువాణి ఆర్ఎంపీ వైద్యులకు సూచించారు. ఆదివారం స్థానిక అల్ హిలాల్ పాఠశాలలో ఆర్ఎంపీల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, యాంటీ బయాటిక్స్ వేయరాదన్నారు. వైద్యం పూర్తిగా తెలియకపోవడంతో రోగుల ప్రాణాలు పోతాయని, అత్యవసర సమయంలో ప్రభుత్వ వైద్యశాలకు పంపాలన్నారు. ఇటీవల కొక్కంటి ప్రాంతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకూడదని హెచ్చరించారు. పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోవద్దన్నారు. అత్యవసర సమయాల్లో ప్రభుత్వ ఆసుపత్రికి, ఇతర అర్హతలు ఉన్న వైద్యుల వద్దకు పంపాలన్నారు. కొంత మంది అన్ని రకాల వైద్యం అందుతుందని, చిన్న పిల్లలకు ప్రత్యేకంగా చూడబడునని బోర్డులు వేసుకొని ఉంటారన్నారు. వాటిని తొలగించాలని కేవలం ప్రథమ చికిత్సాకేంద్రాలు అని మాత్రమే రాసుకోవాలన్నారు. ఆర్ఎంపీ కేంద్రాల్లో సెలెన్ బాటిల్లతోపాటు, బెడ్లు, స్టాండ్‌లు, మంచాలు, ఉండకూడదని, ఇంజక్షన్ వేయరాదని ప్రసవాలు చేయకూడదని, అబార్షన్ లాంటివి అసలు చేయరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యులు పద్మజ, మాధుర్య, జిల్లా మాస్ మీడియా అధికారి బాబా ఫక్రుద్దీన్, ఆర్ఎంపీలు సంఘం అధ్యక్షుడు గోవిందరాజులు, ఆంజనేయులు, ఏసురత్నం, వైద్య సిబ్బంది ముస్తాఫా, రమేష్, మల్లప్ప, ఆదిల్ తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులు.. ప్రత్యక్ష దైవాలు



కేక్ కట్ చేస్తున్న పాస్టర్ స్టీఫెన్‌రాజు తదితరులు

హిందూపురం అర్బన్, జూలై 28: తల్లి తండ్రులు ప్రత్యక్ష దైవాలు అని సీఅండ్ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చిపాస్టర్ రెవరెండ్ స్టీఫెన్‌రాజ్, సంఘం కార్యదర్శి డాజ నాగేంద్రకుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీఅండ్ ఐజీ మిషన్ చర్చిలో తల్లితండ్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల కోసం ప్రతి తల్లి తండ్రి పిల్లల కోసం ఎంతటి కష్టాన్ని అయినా భరించడానికి సిద్ధపడుతారని, అలాంటి తల్లిదండ్రులను వృద్ధాప్యంలో కంటికి రెప్పలా బిడ్డలు చూసుకోవాలన్నారు. అనంతరం చర్చిలో కేక్ కట్ చేసి తల్లిదండ్రులకు శాలువాలు కప్పి సన్మానించారు. సంఘం కోశాధికారి జాషువ, సంయుక్త కార్యదర్శి స్టాల్మన్‌రాజ్, డీకెన్ సభ్యులు అరుణ్‌కుమార్, దేవరాజ్, జార్జిబాబు, జాన్ ప్రసాద్, డేవిడ్, యూత్ కమిటీ సభ్యులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహిద్దాం

సోమందేపల్లి, జూలై 28: కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకుందామని యాదవ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కాలమ్మ గుడి వద్ద ఆదివారం సంఘం నాయకులు సమావేశమై పండుగ గురించి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 26న కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించుకునే నేపథ్యంలో తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలను ఏటా ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. నాయకులు నరసింహులు, నారాయణస్వామి, శ్రీనివాసులు, రాజగోపాల్, మూర్తి, మహేష్, గోపాల్, అంజి పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు సన్మానం

గోరంట్ల, జూలై 28: పట్టణంలోని రంగమహల్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి బ్రాహ్మణ సేవా సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. పరుశురాం బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మూడవ వార్షికోత్సవం నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన బ్రాహ్మణులు ఈసమావేశానికి హాజరయ్యారు. నిష్ణాతులైన బ్రాహ్మణ పురోహితులు, ప్రతిభావంతులైన బ్రాహ్మణులను ఈసందర్భంగా సేవా సంఘం సన్మానిచింది. పేరియూరి ఫణీభూషణశర్మ, బ్రాహ్మణ పిల్లలకు ఆన్‌లైన్‌ద్వారా ఐదువందలఖమంది వేదపఠనం నిర్వహించడంతో ఆయనను సన్మానించారు. దాడితోట ప్రసాద్‌శర్మ వందమంది పిల్లలకు వేదపఠనం చేసినందుకు, మాజీ ఎంఈ ఓలు సుబ్రమణ్యం, రెడ్డికేశవప్రసాద్, తుమ్మల, సుబ్బారావు, డాక్టర్ ఆదిమూర్తిలను సన్మానించారు. ఈకార్యక్రమంలో పంచాగం మధుసూధన శాస్త్రీ, పంచరత్నం సురేష్‌బాబు, బూదిలి శ్రీకాంతంశేఖర్‌శర్మ, మోహన్‌శర్మ, హర్షవర్ధన్, మురళికృష్ణ, కరణం ప్రకాష్ రావు, పరుశురామ సేవాసంఘనికి చెందిన పలువురు పాల్గొన్నారు.



ఫణిభూషణ శర్మ దంపతులను సన్మానిస్తున్న సభ్యులు